క్లుప్తంగా

తాగునీటి సమస్యకు పరిష్కారం


గ్రామంలో నిర్మించిన వాటర్ ట్యాంక్

సాలూరు రూరల్: మండలంలోని కురుకూటి పంచాయతీ పోతన్నవలస గ్రామంలో తాగునీటి సమస్యకు పరిష్కారం లభించింది. గతంలో తాగునీటి కోసం గ్రామస్తులు అవస్థలు పడేవారు. సమస్యను గత పాలకులు, అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా పరిష్కారం లభించలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఎమ్మెల్యే పీడిక రాజన్నదొర ప్రత్యేక చొరవతీసుకుని గ్రామంలో రూ.9 లక్షలతో రక్షిత మంచినీటి ట్యాంక్ నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం పూర్తిస్థాయిలో నీటిని సరఫరా చేస్తుండటంతో తాగునీటి సమస్య పరిష్కారమైందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా నవగ్రహ ఉపాలయ విగ్రహ ప్రతిష్ట


పూజలు నిర్వహిస్తున్న దంపతులు

సాలూరు రూరల్: మండలంలోని మామిడిపల్లి గ్రామంలో గిరిజా రామలింగేశ్వర స్వామి ఆలయంలో నవగ్రహ ఉపాలయ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అండవిల్లి సూర్యం పంతులు ఆధ్వర్యంలో స్థానిక సర్పంచ్ సువ్వాడ శశికళ దంపతులతో పాటు మరో 8 మంది దంపతులు కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శాస్త్రోక్తంగా ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహించారు. మోతూరు పద్మావతి సహకారంతో భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మండల సమావేశం

సీతానగరం: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బి.రవణమ్మ అధ్యక్షతన శుక్రవారం మండల సమావేశం జరిగింది. ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు ఆధ్వర్యంలో ఎన్నికల నిబంధనల మేరకు సమావేశం నిర్వహించారు. సమావేశంలో తాగునీరు, పారిశుద్ధ్య పనుల నిర్వహణపై చర్చించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ టి.సూర్యనారాయణ, జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీఆర్ఎంటీలకు అప్పగించిన పనులు పూర్తిచేయాలి

పార్వతీపురంటౌన్: వేసవి సెలవుల్లో విద్యాశాఖ సూచించిన అంశాలను, ఆన్‌లైన్ పనులను సీఆర్ఎంటీలు పూర్తి చేయాలని ఎంఈఓ సామల సింహాచలం అన్నారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో సీఆర్ఎంటీలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. వేసవి సెలవుల్లో విద్యాశాఖ అప్పగించిన పనులను ఎప్పటికప్పుడు పూర్తి చేసి ఆ సమాచారం ఆఫీస్‌కు అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 కె.ప్రసాదరావు, సీఆర్ఎంటీలు, పీటీఐలు, ఆఫీస్ సిబ్బంది అప్పారావు, సాత్విక్, తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ బ్రాంచ్ ప్రారంభం

సాలూరు: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ వెంకట తిలక్ అన్నారు. పట్టణంలో యూనియన్ బ్యాంక్ బ్రాంచ్‌ను శుక్రవారం పునఃప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. శ్రీకాకుళం రీజియన్ పరిధిలో 56 శాఖల్లో రూ.7,500 కోట్ల టర్నోవర్‌తో బ్యాంకింగ్ బిజినెస్ చేస్తున్నట్లు చెప్పారు. యోనో యాప్ ద్వారా అన్ని సేవలు ఆన్‌లైన్‌లో పొందవచ్చన్నారు. బ్యాంక్ సేవలను ఖాతాదారులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ వేముల సత్యనారాయణ, ఉద్యోగులు పాల్గొన్నారు.

కర్రివలసలో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్


పాచిపెంట: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో శాంతిభద్రల పర్యవేక్షణపై పోలీసులు దృష్టి సారించారు. ఎస్‌ఐ నారాయణ ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో కవాతు నిర్వహిస్తున్నారు. మండలంలోని కర్రివలస గ్రామంలో శుక్రవారం కేంద్ర బలగాలతో కలిసి ఫ్లాగ్‌మార్చ్ చేపట్టారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ప్రజలు సహకరించాలని కోరారు.

గ్రామదేవత ఆలయ ప్రతిష్ట

బలిజిపేట: పెదపెంకిలో చినపోలమ్మ గ్రామదేవత ఆలయ ప్రతిష్ట కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు వేణుశాస్త్రి ఆధ్వర్యంలో ఎంపీపీ నాగమణి దంపతుల అమ్మవారికి పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. గత మూడు రోజులుగా కలశారాధన, పుణ్యాహవచనం, తిరువీధి, హోమం, కుంకుమ పూజలు నిర్వహించినట్లు చెప్పారు. చివరిరోజు పూర్ణాహుతి, ప్రతిష్ఠాపన పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రగతి పథంలో కవిరిపల్లి

- టీడీపీ హయంలో మాజీ ఎమ్మెల్సీ సంధ్యారాణి స్వగ్రామంలో కానరాని అభివృద్ధి
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.80 లక్షలతో అభివృద్ధి పనులు
- అర్హులందరికీ సంక్షేమ పథకాలు



శ్లాబుదశకు చేరుకున్న రైతుభరోసా కేంద్రం, (ఇన్‌సెట్లో) గ్రామ సచివాలయం

మక్కువ: పంచాయతీల అభివృద్ధిని టీడీపీ ప్రభుత్వం గాలికొదిలేస్తే.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పంచాయతీలను ప్రగతిబాట పట్టించింది. టీడీపీ మాజీ ఎమ్మెల్సీ, సాలూరు అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి గుమ్మడి సంధ్యారాణి స్వగ్రామం కవిరిపల్లే ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యం. ఆరేళ్ల టీడీపీ ఎమ్మెల్సీగా పని చేసిన సంధ్యారాణి స్వగ్రామంలో చేసిన అభివృద్ధి శూన్యం. గ్రామంలో రహదారులు, తాగునీరు, సాగునీరు, తదితర కనీస వసతులకు నోచుకోక ప్రజలు ఇబ్బందులు పడేవారు. గ్రామ దేవత ముత్యాలమ్మ గుడికి వెళ్లేందుకు సుమారు 100 మీటర్ల మేర గ్రావెల్ రోడ్డు వేసి మమ అనిపించారు. అధికారంలో ఉన్నప్పుడు తమ గ్రామం వైపు తొంగిచూడలేదంటూ గ్రామస్తులు గుసగుసలాడుకుంటున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామ స్వరూపమే మారిపోయిందని గ్రామస్తులు అంటున్నారు. డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర సహకారంతో ఐదేళ్లలో గ్రామంలో సుమారు రూ.80 లక్షలతో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. గ్రామ సచివాలయం, సీసీరోడ్లు, కాలువల నిర్మాణం, శ్మశానవాటిక వద్ద బోరు ఏర్పాటు, నాడు-నేడు నిధులతో పాఠశాల భవనం నిర్మాణం, వంటి పలు అభివృద్ధి పనులు చేపట్టారు. రైతుభరోసా కేంద్ర భవనం నిర్మాణంలో ఉంది. గ్రామ సచివాలయ వ్యవస్థతో ప్రభుత్వ సేవలన్నీ ఊర్లోనే అందుతున్నాయి. ఎలాంటి అవినీతికి తావులేకుండా సంక్షేమ పథకాల నిధులు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోనే జమ అవుతున్నాయి. అవ్వాతాతలకు ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్ డబ్బులను వలంటీర్లు ఇంటికి తీసుకొచ్చి అందిస్తున్నారు. గ్రామస్థాయిలోనే సమస్యలకు పరిష్కారం చూపిస్తుండటంతో గ్రామస్తులంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- రూ.42 లక్షలతో గ్రామ సచివాలయ నిర్మాణం.
- రూ.21.50 లక్షలతో ఆర్‌బీకే భవనాన్ని నిర్మిస్తున్నారు.
- నాడు-నేడు నిధులు రూ.8 లక్షలతో పాఠశాల భవనాలు కొత్తరూపు దిద్దుకున్నాయి.
- 'గడపగడపకు మన ప్రభుత్వం' నిధులు రూ.10 లక్షలతో ఎస్సీకాలనీలో కాలువలు, సీసీరోడ్డు, శ్మశానవాటిక వద్ద బోరుబావిని ఏర్పాటుచేశారు.
- కవిరిపల్లి, తెలగడవలస గ్రామాల మధ్య రూ.10 లక్షలతో సీసీరోడ్డును నిర్మించారు.
- గ్రామంలో అంగన్‌వాడీ భవనం, వెల్‌నెస్ సెంటర్ భవనాలు మంజూరు చేశారు.


కవిరిపల్లి- తెలగడవలస మధ్య రూ.10 లక్షలతో నిర్మించిన సీసీరోడ్డు


శ్మశానవాటికలో సీసీరోడ్డు, బోరు

సంధ్యారాణి హయంలో అభివృద్ధి జరగలేదు



ఎమ్మెల్సీగా సంధ్యారాణి ఆరేళ్ల పాటు పదవీ బాధ్యతలు చేపట్టినప్పటికీ మా గ్రామంలో ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, వైఎస్సార్‌సీపీ మండల నాయుకులు మావుడి సోదరుల కృషితో సుమారు రూ.80 లక్షలతో అభివృద్ధి పనులు మంజూరయ్యాయి. రైతుభరోసా కేంద్రం మినహా, మిగిలిన పనులన్నీ జరిగాయి. ఆర్‌బీకే శ్లాబుదశకు చేరుకుంది.

– అమరాపు ముత్యాలనాయుడు, కవిరిపల్లి గ్రామం

సీసీరోడ్లు, కాలువలు ఏర్పాటుతో మేలు



గ్రామం నుంచి తెలగడవలస వెళ్లే రహదారి మొత్తం అధ్వానంగా ఉండేది. పొలం పనుల కోసం రహదారిపై నుంచి ప్రయాణించాలంటే అనేక ఇబ్బందులు పడేవాళ్లం. ఈ ప్రభుత్వంలో సీసీ రోడ్డు నిర్మించడంతో ప్రశాతంగా ప్రయాణిస్తున్నాం. గ్రామ సచివాలయం ఏర్పాటుతో ప్రభుత్వ సేవల కోసం మండల కేంద్రానికి వెళ్లాల్సిన పని తప్పింది.

– పెంట పార్వతమ్మ, కవిరిపల్లి గ్రామం

సంక్షేమ పాలనను చూసి ఓటు వేయండి

- గత హామీలు అమలు చేయండా 'సూపర్ సిక్స్' అంటూ చంద్రబాబు కొత్త డ్రామా
- టీడీపీ మాయమాటలు నమ్మి మోసపోవద్దు
- డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర


2014 ఎన్నికల టీడీపీ మ్యానిఫెస్టో కాపీని చూపిస్తున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని, సంక్షేమాన్ని చూసి రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, తనను ఆశీర్వదించాలని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర కోరారు. పట్టణంలో తన స్వగృహంలో శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. తన నామినేషన్ ఆమోదం పొందడం సంతోషంగా ఉందన్నారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతీ హామీని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారని అన్నారు. పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా అర్హులందరికి సంక్షేమ పథకాలు అందించారని తెలిపారు. మోసపూరిత హామీలతో 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు హామీలను అమలు చేయకుండా రైతులు, డ్వాక్రా మహిళలు, నిరుద్యోగ యువతను మోసం చేశారని గుర్తుచేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేదు కాబట్టే ఎన్నికల మేనిఫెస్టోను టీడీపీ వెబ్‌సైట్ నుంచి తొలగించిందని ఎద్దేవా చేశారు. ప్రజలకు మంచి చేసింది జగన్‌మోహన్‌రెడ్డి కాగా, మోసం చేసింది చంద్రబాబు అని పునరుద్ఘాటించారు. ఎన్నికలు రావడంతో చంద్రబాబు 'సూపర్ సిక్స్' అంటూ మోసపూరిత హామీలతో ప్రజలను మోసం చేసేందుకు వస్తున్నారని, వారి మాయమాటలు నమ్మి మోసపోవద్దని ప్రజలను కోరారు. ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా తనూజారాణిని గెలిపించి, జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా మరోసారి ఆశీర్వదించాలని కోరారు.

ఎన్నికల అధికారులు చర్యలు తీసుకోవాలి

నామినేషన్ వేసిన సమయంలో టీడీపీ అభ్యర్థి గుమ్మడి సంధ్యారాణి, నాకు మతిభ్రమించిందంటూ పరుష పదజాలంతో వ్యక్తిగతంగా విమర్శలు చేయడంపై ఎన్నికల అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని రాజన్నదొర కోరారు. తాను ఎప్పుడు టీడీపీ నాయకులు అంటూ విమర్శలు చేశానే తప్ప పరుష పదజాలంతో వ్యక్తిగతంగా ఎవరిపైన విమర్శలు చేయలేదని గుర్తుచేశారు. ఎవరికి మతిభ్రమించి అఫిడవిట్‌లలో సంతకాలు పెట్టకుండా నామినేషన్లు వేశారో తెలుసని సంధ్యారాణికి చురకలు అంటించారు.

జగనన్నను మరోసారి సీఎంను చేసుకుందాం


నిమ్మవానివలసలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు


చుక్కవానివలసలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా కార్యకర్తలందరూ శక్తివంచన లేకుండా పని చేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు పిలుపునిచ్చారు. మండలంలోని నిమ్మవానివలస, చుక్కవానివలస, అంటివలస గ్రామంలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే జోగారావుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాల వేసి, మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. స్థానిక దేవాలయాల్లో ఎమ్మెల్యే జోగారావు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగనన్న అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి నవరత్నాల పథకాలు అమలు చేశారన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి అభివృద్ధి చేశారన్నారు. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి పార్వతీపురం అసెంబ్లీ అభ్యర్థిగా తనను, అరకు పార్లమెంటు అభ్యర్థిగా డాక్టర్ గుమ్మ తనూజారాణిను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపీపీ మజ్జి శోభారాణి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు బొమ్మి రమేష్, స్థానిక సర్పంచ్ యాళ్ల ప్రమీల, ఈశ్వరరావు, గొర్లి రాజేంద్ర, వైస్ ఎంపీపీలు సిద్ధా జగన్నాథరావు, బంకురు రవికుమార్, యాళ్ల శ్రీరాములనాయుడు, ఎ.అప్పలనాయుడు, వెంకటరమణ, పీఏసీఎస్ చైర్మన్ తీళ్ల శివున్నాయుడు, సర్పంచ్‌లు గండి శంకరరావు, వెండ వెంకటరమణ, ఎంపీటీసీలు మర్రావు వాసుదేవరావు, జేసీఎస్ కన్వీనర్ బి.వాసుదేవరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఆశీర్వదించండి


ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్న రాజన్నదొర, తనూజరాణి

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు రాజన్నదొర, తనూజారాణి

సాలూరు: ఫ్యాను గుర్తుపై ఓటు వేసి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని, రాష్ట్రంలో సంక్షమ, అభివృద్ధి పాలనను కొనసాగేలా ఆశీర్వదించాలని డిప్యూటీ సీఎం, సాలూరు అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీడిక రాజన్నదొర, అరకు పార్లమెంట్ అభ్యర్థి గుమ్మ తనూజారాణి కోరారు. పట్టణంలోని 6వ వార్డు కోటవీధి, అగురువీధి, జర్జాపువీధిల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజన్నదొర, తనూజరాణి మాట్లాడుతూ.. ప్రజలను మోసం చేయడం చంద్రబాబు అజెండా అయితే, అన్ని వర్గాల ప్రజలకు మంచి చేయడమే జగన్‌మోహన్‌రెడ్డి అజెండా అని అన్నారు. పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఎన్నికలు సమీపించడంతో మోసపూరిత హామీలతో ప్రజలను మభ్యపెట్టేందుకు టీడీపీ నాయకులు వస్తున్నారని, వారి మాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తమను, జగన్‌మోహన్ రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వంగపండు అప్పలనాయుడు, జర్జాపు ఈశ్వరరావు, నీలిమ, సూరిబాబు, గిరి రఘు, రాపాక మాధవరావు, పిరిడి రామకృష్ణ, రవి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మేస్థితిలో లేరు

- వైఎస్సార్‌సీపీ జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు సువ్వాడ రామకృష్ణ



సాలూరు రూరల్: టీడీపీ కూటమి అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి సాలూరు మండలాన్ని తానే అభివృద్ధి చేశానని అసత్యాలను ప్రచారం చేస్తున్నారని, ఆమె చెప్పే అబద్ధాలను ప్రజలు గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో ఆమెకు సరైన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా సేవాదల్ అధ్యక్షులు సువ్వాడ రామకృష్ణ అన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర సాలూరు నియోజకవర్గంలో రూ.1200 కోట్లు అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. నామినేషన్ అనంతరం నిర్వహించిన ర్యాలీలో రాజన్నదొర సాలూరు నియోజవర్గంలో తాను చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారన్నారు. పట్టణంలోని బోసుబొమ్మ కూడలిలో టీడీపీ ర్యాలీ సందర్భంగా మాట్లాడిన సంధ్యారాణి సాలూరు నియోజకవర్గానికి తాను చేసిన అభివృద్ధి ఎంటో చెప్పలేకపోయారని ఎద్దేవా చేశారు. మోసపూరిత మాటలు చెప్పే టీడీపీ నాయకులను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ఈ ఎన్నికల్లో రాజన్నదొర భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

నామినేషన్ల పరిశీలన పూర్తి

పార్వతీపురంటౌన్: పార్వతీపురం నియోజకవర్గ పరిధిలో నామినేషన్ పరిశీలన పూర్తయినట్లు ఆర్డీఓ, నియోజకవర్గ ఎన్నికల అధికారి హేమలత తెలిపారు. శుక్రవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో అభ్యర్థుల సమక్షంలో నామినేషన్లను పరిశీలించారు. మొత్తం 13 నామినేషన్లు రాగా, అందులో అన్ని వివరాలు సక్రమంగా ఉన్న 10 నామినేషన్లను ఆమోదించారు. వివధ కారణాలతో మూడింటిని తిరస్కరించారు.

సాలూరులో 13 నామినేషన్లు ఆమోదం

సాలూరు: సాలూరు అసెంబ్లీ స్థానానికి వచ్చిన నామినేషన్లను రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్ శుక్రవారం పరిశీలించారు. మొత్తం 15 నామినేషన్లు అందగా.. వాటిని పరిశీలించి అందులో 13 నామినేషన్లు ఆమోదించారు. వివిధ కారణాలతో రెండింటిని తిరస్కరించారు. అలాగే స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలను, వేద సమాజం పోలింగ్ కేంద్రాన్ని, ఆర్వో కార్యాలయాన్ని ఎన్నికల అబ్జర్వర్ నయీం ముస్తఫా మన్సూరి పరిశీలించారు. ఆయన వెంట పట్టణ, రూరల్ సీఐలు వాసునాయుడు, బాలకృష్ణ, ఎస్‌ఐలు సీతారాం, నారాయణ, తదితరుల ఉన్నారు.

చెక్‌పోస్ట్ పరిశీలన

పాచిపెంట: మండలంలో పి.కోనవలస వద్ద ఏర్పాటుచేసిన ఆంధ్రా-ఒడిశా చెక్‌పోస్టును ఎన్నికల అబ్జర్వర్ నయీం ముస్తఫా మన్సూరి శుక్రవారం పరిశీలించారు. అక్కడి రికార్డులను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎన్నికల నేపథ్యంలో మద్యం, నగదు, ఇతర సామగ్రి తరలింపుపై నిఘా కట్టుదిట్టం చేయాలని, అప్రమత్తతతో విధులు నిర్వహించాలని సూచించారు. ఆయన వెంట రూరల్ సీఐ బాలకృష్ణ, ఎస్‌ఐ నారాయణ, తదితరులు ఉన్నారు.

సీఎం జగన్‌తోనే సుపరిపాలన


బలిజిపేట: గౌరీపురంలో ఇంటింటా ప్రచారం చేస్తున్న జడ్పీటీసీ రవికుమార్, నాయకులు

బలిజిపేట: రానున్న ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి రాష్ట్రంలో సుపరిపాలన కొనసాగేలా చూడాలని జడ్పీటీసీ ఎ.రవికుమార్ కోరారు. మండలంలోని గౌరీపురంలో శుక్రవారం ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలకు ఎంతో మేలు జరిగిందని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాయని గుర్తుచేశారు. సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఎమ్మెల్యే జోగారావు పార్వతీపురం నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారని, ఆయన్ను మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించుకోవడం ద్వారా నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసరావు, ఎం.శ్రీనివాసరావు, సూర్యనారాయణ, పకీరునాయుడు, కె.సింహాచలం, పోలినాయుడు, కె.లక్ష్మణరావు, ఎం.లంబు, వినోద్, పి.నారాయణరావు, మాకినాయుడు, శంకరరావు, డి.శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు మద్దతిద్దాం..

- ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి జగనన్నను మళ్లీ సీఎంను చేసుకుందాం
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు


ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేయాలని కోరుతూ ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు, మండల నాయకులు


టీడీపీ సీనియర్ కార్యకర్త సన్యాసినాయుడుకు కండువా వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: రాష్ట్రంలో రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన జగనన్నను రెండోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఓటర్లను అభ్యర్థించారు. మండలంలోని పాత లక్ష్మీపురం, కొత్తలక్ష్మీపురం గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా గ్రామంలోని రామమందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ఐదేళ్లలో చేసిన అభివృద్ధిని, అందించిన సంక్షేమాన్ని వివరించారు. ఈ సందర్భంగా ప్రతీ గడప వద్ద స్థానిక మహిళలు ఆయనకు హారతులు ఇచ్చి విజయతిలకం దిద్ది మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కొత్త లక్ష్మీపురం నుంచి పువ్వల సన్యాసినాయుడు, పాతలక్ష్మీపురం నుంచి పెరుమాళ గడ్డియ్యతో పాటు మరో 100 కుటుంబాలు టీడీపీకి గుడ్‌బాయ్ చెప్పి వైఎస్సార్‌సీపీలో చేరారు. వారందరికీ ఎమ్మెల్యే జోగారావు కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జయమణి, జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, పార్టీ సీనియర్ నాయకుడు బి.శ్రీరాములునాయుడు, వైస్ ఎంపీపీ టి.సూర్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షులు బి.చిట్టిరాజు, స్థానిక సర్పంచ్ టి.సత్యవతి, ఎంపీటీసీ టి.పార్వతి, సచివాలయ కన్వీనర్లు సీహెచ్.సురేష్‌కుమార్, ఉమా, అప్పలనాయుడు, టి.వెంకటరమణ, డీసీసీబీ డైరెక్టర్ అంబటి కృష్ణంనాయుడు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.తిరుపతిరావు, డి.నాగరత్నం, పి.ఈశ్వరనారాయణ, ఆర్వీ పార్థసారథి, సీడీసీ మాజీ చైర్మన్ రామకృష్ణ, పలు గ్రామాల సర్పంచ్‌లు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సాలూరు సేవకుడు రాజన్నదొర

- జిల్లా గ్రంథాలయ చైర్‌పర్సన్ రెడ్డి పద్మజ


గొందివలసలో ప్రచారం చేస్తున్న జిల్లా గ్రంథాలయ చైర్‌పర్సన్ రెడ్డి పద్మజ

సాలూరు రూరల్: సాలూరు నియోజకవర్గ సేవకుడు మన డిప్యూటీ సీఎం రాజన్నదొర అని జిల్లా గ్రంథాలయ చైర్‌పర్సన్ రెడ్డి పద్మజ అన్నారు. కొత్తవలస పంచాయతీ గొందువలస, గుర్రపువలస, కరకవలస గ్రామాల్లో శుక్రవారం ఆమె ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజల మనసుల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న నాయకుడు రాజన్నదొర అని కొనియాడారు. జగనన్న నాయకత్వంలో నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేసిన పనులను ప్రజలు గుర్తించాలన్నారు. 6 ఏళ్లు ఎమ్మెల్సీగా పదవి చేపట్టిన గుమ్మడి సంధ్యారాణి నియోజకవర్గానికి చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. జగనన్న ముఖ్యమంత్రిగా ఉంటేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కొత్తవలస సర్పంచ్ నెమలిపిట్ట ధర్మవతి, మాజీ సర్పంచ్ బొన్నాడ సీతారాం, నాయకులు జయసింహ, అధికారినాయుడు పాల్గొన్నారు.